## నేడు అన్నమయ్య సంకీర్తనం

చిక్కడపల్లి, ఆన్‌లైన్: రాగరాగిణి ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న సాయంత్రం కళాసుబ్బారావు కళావేదికలో నెలనెలా అన్నమయ్య శీర్షికన 'గోవింద గోవింద అని కొలువరే' అన్నమయ్య సంకీర్తనం కార్యక్రమాన్ని శాస్త్రీయ సంగీత విద్వాంసులు సత్తిరాజు వేణుమాధవ్ నిర్వహిస్తారని ఆ సంస్థ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎంవీ రమణకుమారి, సుబ్బలక్ష్మిలు తెలిపారు. మాజీ ఎంపీ పీవీ రాజేశ్వరరావు, కవయిత్రి శరత్ జ్యోత్స్నారాణి తదితరులు కార్యక్రమంలో పాల్గొంటారని ప్రేక్షకులు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సుల జప్తు

ఆన్‌లైన్, సిటీబ్యూరో: అనుమతి పత్రాలు లేకుండా విద్యార్థులను చేరవేస్తున్న మూడు స్కూల్ బస్సులను తనిఖీల్లో గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు రవాణా శాఖ జాయింట్ కమిషనర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు, మిధాని, మెహిదీపట్నం ప్రాంతాల్లో ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను గుర్తించి స్కూల్ యజమానులపై కేసులు నమోదు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఫిట్‌నెస్, పర్మిట్స్ లేకుండా బస్సులను తిప్పుతూ స్కూల్ విద్యార్థులతో చెలగాటమాడే పాఠశాలల యజమానులపై కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు.

## నేడు ఏబీవీపీ పాఠశాలల బంద్

ఆన్‌లైన్, సిటీబ్యూరో: విద్యావ్యాపారం అరికట్టాలని, పాఠశాల విద్యను కాపాడాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) మంగళవారం(ఈ నెల 22న) రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ నిర్వహించనుంది. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలని, పుస్తకాలు, యూనిఫామ్‌ల వ్యాపారం అరికట్టాలని కోరుతూ బంద్ పాటించనున్నట్లు ఏబీవీపీ సెంట్రల్‌జోన్ ఇన్‌చార్జి కల్యాణ్ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు పాటించని విద్యాసంస్థలను మూతపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని కోరారు. మంగళవారం జరిగే బంద్‌కు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు.

## 23 నుంచి పదోన్నతుల కౌన్సెలింగ్

ఆన్‌లైన్, సిటీబ్యూరో: ఉపాధ్యాయుల పదోన్నతుల కౌన్సెలింగ్ ఈ నెల 23వ తేదీ నుంచి జరుగనుందని జిల్లా ఇన్‌చార్జి డీఈవో జగన్నాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేడ్-2 హెడ్మాస్టర్ పోస్టుల కోసం ఈ నెల 23న గన్‌ఫౌండ్రీ డీఈవో కార్యాలయం పైనున్న ఆర్జేడీ కార్యాలయంలో, ఈ నెల 24, 25వ తేదీల్లో స్కూలు అసిస్టెంట్‌పోస్టుల కోసం నారాయణగూడలోని మాడపాటి హనుమంతరావు బాలికల ఉన్నత పాఠశాలలో, 26వ తేదీన ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్మాస్టర్ పోస్టుల భర్తీకోసం అదే ప్రాంగణంలో కౌన్సెలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో 140 దాకా స్కూలు అసిస్టెంట్, 32 దాకా ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్మాస్టర్, 18 దాకా గ్రేడ్-2 హెడ్మాస్టర్ల పోస్టులు ఈ కౌన్సెలింగ్‌లో భర్తీ చేయనున్నారు.

# 'ఆధ్యాత్మిక సేవాభావం పెంపొందించుకోవాలి'

అబ్దుల్లాపూర్‌మెట్, ఆన్‌లైన్: మనిషి ఆధ్యాత్మికతతో పాటు సేవాభావాన్ని పెంపొదించుకోవడంలో లభించే ఆనందం మరెందులోనూ దొరకదని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్‌స్వామి అన్నారు.

హయత్‌నగర్ మండలంలోని పెద్ద అంబర్‌పేట గ్రామ పరిధిలో ఉన్న సూరజ్ ఓల్డేజి అండ్ చిల్డ్రన్స్ హోం సమీపంలో శ్రీరాధాకృష్ణ మందిరంలో జరిగిన ప్రత్యేక పూజలు ఘనంగా ముగిసాయి. ముగింపు రోజైన సోమవారం కార్యక్రమానికి విచ్చేసిన చిన జీయర్‌స్వామి భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. మానసిక ప్రశాంతతకు దైవచింతన ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. మానవసేవ చేసే వారికి భగవంతుని కృప చేకూరుతుందన్నారు. వృద్ధాశ్రమంతో పాటు ఆలయాన్ని నిర్మించడం అభినందనీయమని నిర్వాహకులను కొనియాడారు.

హోంలో 50 మంది వృద్ధులకు ఉచితంగా సకల సదుపాయాలు కల్పించడం ఆనందించదగిన విషయమని, 75 మంది పేద విద్యార్థులకు 1 నుంచి 10వ తరగతి వరకు ఓ ప్రైవేటు పాఠశాలలో ఫీజులు చెల్లించి విద్యాదానం చేయడం అభినందనీయమన్నారు. సంపాదనే ధ్యేయంగా కాకుండా అందులో సేవ కోసం కూడా కొంత సంపాదనను వెచ్చించాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో హోం నిర్వాహకులు జగదీశ్ ప్రసాద్ అగర్వాల్, రాంనివాస్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న చిన జీయర్ స్వామి

# ఐటీ రంగానికి ఉజ్వల భవిష్యత్

## కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ఎస్ఎస్ఐ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి

పంజాగుట్ట, ఆన్‌లైన్: ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగం అభివృద్ధి పథంలో పయనిస్తోందని, భవిష్యత్‌లో విద్యార్థులకు ఈ రంగం ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్స్, యూత్ సర్వీసెస్ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. ఈ రంగంలో నిపుణులైన ఉద్యోగుల కొరత కూడా పెరుగుతున్న తరుణంలో మరింతమంది విద్యార్థులు శిక్షణ పొందాలన్నారు. సోమవారం సోమాజిగూడలోని చక్కిలం హౌస్‌లో ఎస్ఎస్ఐ ఎడ్యుకేషన్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కూడా రాజీవ్ ఉద్యోగశ్రీతోపాటు ఇతర పథకాల ద్వారా విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ రంగంలో శిక్షణ ఇస్తోందన్నారు. ఎస్ఎస్ఐ ఆపరేషన్స్ హెడ్ పి.మహాలక్ష్మి మాట్లాడుతూ ఇంటర్‌పాసైన వారు ఈ కోర్సులను అభ్యసించవచ్చని, తమ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులకు ప్లేస్‌మెంట్ కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి రత్న ప్రభ, సెంటర్ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, ఎస్ఎస్ఐ ప్రతినిధి శక్తివేల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వంతో జరిగే చర్చల్లో అన్ని బీసీ సంఘాలను ఆహ్వానించాలి

ఖైరతాబాద్, ఆన్‌లైన్: రాష్ట్రంలోని బీసీలు కోరుతున్న 14 డిమాండ్లపై బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగే చర్చల్లో అన్ని బీసీ సంఘాలను ఆహ్వానించకపోవడాన్ని బీసీ కుల సంఘాల సమైక్య సంఘటన సమితి తీవ్రంగా ఖండించింది. సోమవారం సైఫాబాద్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో బీసీ యునైటెడ్ ఫ్రంట్, ఐక్య సంఘర్షణ సమితి, బీసీ ఫోరమ్, రాష్ట్ర యువ కాపునాడు, ఆంధ్రరాష్ట్ర బీసీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఉమ్మడి ప్రకటన చేశారు. వీరు మాట్లాడుతూ బీసీలకు సంబంధించి డిమాండ్ల సాధనకు 25 వ తేదీ నుంచి ఆర్ కృష్ణయ్య చేపట్టబోయే ఆమరణ నిరాహారదీక్షకు తమ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపాయి. సమావేశంలో బీసీ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు పాలూరు రామకృష్ణయ్య, ఐక్య సంఘర్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వీజీఆర్ నారగోని, ఫోరమ్ అధ్యక్షుడు ఆకురాతి మురళీకృష్ణ, రాష్ట్ర యువ కాపునాడు అధ్యక్షుడు వేల్పూరి శ్రీనివాస్, ఆంధ్ర రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వీర శేఖర్‌యాదవ్, మహిళా నాయకురాలు సి.లక్ష్మి లు పాల్గొన్నారు.

## పసిఫిక్ ఏసియా డాటామైనింగ్ సదస్సులకు ట్రిపుల్ ఐటీ వేదిక

గచ్చిబౌలి, ఆన్‌లైన్: నాలెడ్జ్ డిస్కవరీ అండ్ డాటా మైనింగ్-2010 పసిఫిక్ ఏసియా 14వ అంతర్జాతీయ సదస్సుకు గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ వేదికైంది. ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ అంతర్జాతీయ సదస్సు సోమవారం ట్రిపుల్ ఐటీలో ప్రారంభమైంది. 1997నుంచి వరుసగా వివిధ దేశాలలో ఏర్పాటయ్యే ఈ అంతర్జాతీయ సదస్సులు ఈ సారి భారత్‌దేశంలో మొదటిసారిగా గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ ఆతిథ్యమిస్తుంది. ఈ నెల 24వరకు కొనసాగనున్న ఈ సదస్సు లో 8దేశాలకు చెందిన 134మంది విదేశీ ప్రతినిధులతో కలుపుకొని మొత్తం 300మంది పాల్గొననున్నారు. డాటా మైనింగ్‌పై యువ విద్యార్థులు, విదేశీ ప్రతినిధులు ఈ సదస్సులో చర్చించనున్నారు. ట్రిపుల్ ఐటీలో విలేఖరుల సమావేశంలో డైరెక్టర్ రాజీవ్‌సంఘాల్ మాట్లాడుతూ.. నేడు ప్రపంచవ్యాప్తంగా కంప్యూటర్ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులతో టన్నుల కొద్దీ డాటా ఉత్పన్నమవుతుందన్నారు. వైద్య, పర్యావరణ, భద్రత రంగాలలో డాటా మైనింగ్ కీలకపాత్ర పోషించనుందన్నారు. ట్రిపుల్ ఐటీతో పాటు మాదాపూర్‌లోని హెచ్ఐసీసీ, నోవాటెల్ హోటల్‌లో ఈ వర్క్‌షాపులు ఏర్పాటు కానున్నాయన్నారు. ప్రొఫెసర్ రాజీవ్ బగ్గా, ప్రొఫెసర్ కృష్ణారెడ్డిలు ఈ విలేఖరుల సమావేశంలో పాల్గొన్నారు.

## 'స్వలింగ సంపర్గ చట్టంతో కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నం'

బర్కత్‌పుర, ఆన్‌లైన్: స్వలింగ సంపర్గ చట్టం దేశంలోని కుటుంబ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తుందని వివిధ మతాలకు చెందిన ప్రతినిధులు ఆరోపించారు. ఇలాంటి విపత్కర చట్టాలను అన్ని మతాల వారు పూర్తిగా వ్యతిరేకించాలని వారు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సెంటర్ ఫర్ పీస్ అండ్ మెసేజ్ (సీపీటీఎం) ఆధ్వర్యంలో 'మన దేశ నైతిక విలువలు - ప్రస్తుత చట్టాల విధి విధానాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వివిధ మతాలకు చెందిన ప్రతినిధులు మౌలానా వలి రహమానీ, అబ్దుల్‌రహీం ఖురేషి, మౌలానా ఖలీద్ సఫుల్లా రహమాని, డాక్టర్ సహదేవ దాత, డాక్టర్ జట్టి ఎ.వలీవర్, వెంకటేశ్వరరాజు, ఇక్బాల్ అహ్మద్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వలింగ సంపర్గాన్ని అన్ని మతాల వారు ఐక్యంగా ఎదురించాలని వారు కోరారు. విభిన్న మతాలకు, జాతులకు మన దేశం నిలయంగా ఉందని, అలాంటి దేశంలో ప్రజల్ని బాధించే చట్టాలను తీసుకురావడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. స్వలింగ సంపర్గ చట్టం వలన దేశం భ్రష్టుపట్టిపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల మనోభావాలను, దేశ ప్రతిష్టను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వాలు ఇలాంటి దుష్ట చట్టాలను తీసుకువస్తున్నాయని వారు ఆరోపించారు.

## పెట్టుబడిదారీ విధానాల వల్లనే ఆర్థిక సంక్షోభం

హిమాయత్‌నగర్, ఆన్‌లైన్: పెట్టుబడిదారీ విధానం వల్లనే ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం నెలకొందని పలువురు మేధావులు అభిప్రాయపడ్డారు. ఆల్ ఇండియా పీస్, సాలిడారిటీ సంస్థ ఆధ్వర్యంలో 'జర్మనీ ఆర్థిక రాజకీయాల గుణపాఠాలు ప్రపంచానికి వాటి సందేశం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో జర్మనీ మేయర్ గుజ్జుల రవీంద్ర, జర్మనీ డిస్ట్రిక్ట్ మోన్ అంజాన్, రాజ్యసభ సభ్యులు అజీజ్ పాషా, ఏయిడ్సో అధ్యక్షులు డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. జర్మనీలో 92 శాతం మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నారని, జర్మనీ ఆర్థిక విధానం ఆదర్శనీయమని వారు పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలను చేరదీసి వ్యవస్థాత్మకంగా శ్రమించినపుడే అభివృద్ధి సాధ్యమని, దీనికి ప్రభుత్వాలు పూనుకోవాలని వారు సూచించారు. వామపక్షాలు ఐక్యంగా ప్రపంచ ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.

## 'ఆర్టీసీలో గ్యారేజీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి'

బర్కత్‌పుర, ఆన్‌లైన్: ఆర్టీసీలో పని చేస్తున్న గ్యారేజీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.జె.సుధాకర్‌రావు తెలిపారు. ఖాళీగా ఉన్న మెకానికల్ పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్లు ఆయన చెప్పారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఎన్ఎంయూ రాష్ట్ర గ్యారేజీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో సుధాకర్‌రావు మాట్లాడుతూ ఆర్టీసీకి గ్యారేజీ గుండెకాయలాంటిదని, గ్యారేజీలలో ఔట్ సోర్సింగ్ విధానం అంత మంచిది కాదని అన్నారు. వాహనాల కొనుగోలు, ఖాళీల భర్తీ విషయంలో ఆర్టీసీ యాజమాన్యానికి అధికారం లేనప్పటికీ ప్రభుత్వం మాత్రం సానుకూలంగానే స్పందిస్తుందన్నారు. అప్రెంటిస్‌షిప్ కింద అయిదు వేల మందిని తీసుకోవడానికి అనుమతివ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆయన చెప్పారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ గ్యారేజీలలో దాదాపు వెయ్యిపోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటన్నింటినీ త్వరలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పోరాటాల ఫలితంగానే కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయించామన్నారు. వచ్చే డిసెంబర్ వరకు ఆర్టీసీలో అన్ని ఖాళీలు భర్తీ కానున్నాయని ఆయన వివరించారు. ఈ సమావేశానికి ఎన్ఎంయూ హైదరాబాద్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గురుమూర్తి అధ్యక్షత వహించగా ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జయరామ్, ఎన్ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమూద్, రాష్ట్ర కార్యదర్శి రమేష్, గ్యారేజీ కార్యదర్శుల వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందరావు, భాను, బి.సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రగడ్డ రైతుబజార్‌లో రూ.69 లకే 10 రకాల కూరగాయలు నేటి నుంచి

ఎర్రగడ్డ, ఆన్‌లైన్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో రూ.69లకే 10 రకాల కూరగాయలు విక్రయిస్తున్నామని రైతు బజార్ ఎస్టేట్ అధికారి కె.ఆర్.విజయకుమార్ తెలిపారు. మంగళవారం నుంచి అధికారికంగా రైతు బజార్‌లో ఈ పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతు బజార్ల మార్కెటింగ్ శాఖ ఆదేశాల మేరకు ఈ పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. సబ్సిడీ కూరగాయల పద్ధతిని ప్రవేశ పెట్టిన తర్వాత కేవలం 69 రూపాయలకే పది రకాల కూరగాయలను వినియోగదారులకు విక్రయించడం ఇదే మొదటి సారి అని పేర్కొన్నారు. ధరలు విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో ధరలు అదుపులోకి వచ్చేంత వరకు ఈ సబ్సిడీ కూరగాయల విక్రయాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

## తెలుగు విశ్వ విద్యాలయం కోర్సుల దరఖాస్తు గడువు రేపటి వరకు

నాంపల్లి, ఆన్‌లైన్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం హైదరాబాద్, రాజమండ్రి, వరంగల్, శ్రీశైలం, కూచిపూడి ప్రాంగణాల్లో నిర్వహిస్తున్న వివిధ కోర్సులకు అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించే గడువు బుధవారంతో ముగుస్తున్నట్లు విశ్వవిద్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. 250 రూపాయల ఆలస్య రుసుముతో జూన్ 30వ తేదీ వరకు చెల్లించవచ్చని తెలిపారు. నగరంలోని తెలుగు విశ్వవిద్యాలయంలో భాషా శాస్త్రం, జర్నలిజం, కర్ణాటక సంగీతం, కూచిపూడి, ఆంధ్ర నాట్యం, రంగస్థల కళలు, జానపద కళలు, చిత్రలేఖన, శిల్పకళ, పద్యనాటకం, లలిత సంగీతం, జ్యోతిష్యం, ఆంగ్లం, తులనాత్మక సాహిత్యం, కల్చర్, టూరిజం, హరికథ, బుర్రకథ, మిమిక్రీ వంటి అంశాల్లో సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ డిప్లొమా ఎంఏ, ఎంపీఏ, బీఎఫ్ఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ స్థాయి రెగ్యులర్, సాయంకాలం కోర్సులను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రాజమండ్రిలో ఎంఏ తెలుగు, ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సులు, శ్రీశైలంలో చరిత్ర సంస్కృతి పురావస్తు శాస్త్రాల్లో ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ, కూచిపూడిలో కర్ణాటక సంగీతం, కూడిపూడి నాట్యంలో సర్టిఫికెట్, డిప్లొమా, ఎంఏ కోర్సులు, వరంగల్‌లో పేరిణి నృత్యంలో కోర్సులను నిర్వహిస్తున్నారు. నగరంలోని ప్రాంగణంలో సినిమా దర్శకత్వంతో పాటు ఎంఏ క్లాసికల్ తెలుగు, సృజనాత్మక రచన, ముహూర్త విజ్ఞానం వంటి కొత్త కోర్సులను ఈ సంవత్సరం ప్రవేశ పెట్టారు. పై కోర్సులకు దరఖాస్తు చేసుకునే వారు పూర్తి వివరాల కోసం హైదరాబాద్ 040-23230435, రాజమండ్రి 0883-2419322, శ్రీశైలం 08524 - 287153, వరంగల్ 0870-2441258, కూచిపూడి 08671-252246 ఫోన్ నెంబర్‌లకు సంప్రదించడంతో పాటు విశ్వ విద్యాలయం వెబ్‌సైట్ www.teluguuniversity.ac.in ను సంప్రదించవచ్చు.